క్లుప్తంగా

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు



గని గ్రామంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న దృశ్యం

గడివేముల: ఉపాధి హామీ పనులల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని అంబుడ్స్‌మన్ అధికారి సురేంద్ర కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఆయన మంగళవారం మండలంలోని గని, మంచాలకట్ట గ్రామాలలో జరిగిన ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అందరికీ ఆమోదయోగ్యమైన పనులు చేయాలని సూచించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీఓ వెంకటరమణ, ఈసీ సునీల్‌కుమార్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ జగనన్న కానుక



విద్యార్థులతో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష స్టేట్ అబ్జర్వర్ ఇస్మాయిల్

కోడుమూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ జగనన్న విద్యా కానుక అందేలా చర్యలు తీసుకున్నట్లు సమగ్ర శిక్ష స్టేట్ అబ్జర్వర్ ఇస్మాయిల్ తెలిపారు. ఆయన మంగళవారం కోడుమూరులోని బాలుర హైస్కూల్‌ను సందర్శించి జగనన్న విద్యాకానుక కిట్లు విద్యార్థులందరికీ అందాయా? లేదా? అని విచారించి విద్యార్థుల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. కొత్తగా అడ్మిషన్ అయిన విద్యార్థులు తమకు విద్యాకానుకలు అందలేదని అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లగా వారి పేర్లు ఆన్‌లైన్‌లో కొత్తగా నమోదయ్యాయని, వారికి త్వరలో కిట్లు మంజూరవుతాయని హెచ్‌ఎం తైమూర్ బాషా వివరించారు. కోడుమూరు ఎంఈఓ శరభయ్య, సమగ్రశిక్ష అసిస్టెంట్ ఏఎంఓ శివశంకర్ ఉన్నారు.

ఎల్లమ్మతల్లీ.. దీవించమ్మా



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మతల్లి

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం వెంకాయపల్లెలో వెలసిన ఎల్లమ్మతల్లికి మంగళవారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 5 గంటలకు ఆలయ పూజారులు అమ్మవారికి అభిషేకం, పంచామృతాభిషేకం, సుగంధద్రవ్యాల అభిషేకం, కుంకుమార్చన నిర్వహించి, పూలతో అలంకరించారు. భక్తులు గుడిచుట్టూ ప్రదర్శనలు చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా దేవస్థానం చైర్మన్ దినేష్, జూనియర్ అసిస్టెంట్ సాయికుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అధికారుల విస్తృత పర్యటన

ఓర్వకల్లు: మండల స్థాయి అధికారుల బృందం గ్రామాలలో విస్తృత పర్యటన చేశారు. మంగళవారం మండలంలోని కాల్వ-1, 2 సచివాలయాల పరిధిలో పర్యటించారు. ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్లు ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలకు దరఖాస్తులు సేకరించారు. సచివాలయం-1 పరిధిలో 825 కుటుంబాలను సందర్శించగా 260 దరఖాస్తులు రాగా, సచివాలయం-2 పరిధిలో 740 కుటుంబాలను సందర్శించగా 250 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎంపీడీఓ శివనాగప్రసాద్, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, డీటీ సతీష్, ఈఓఆర్‌డీ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేకు సహకరించాలి

కర్నూలు (న్యూటౌన్): భూముల రీసర్వేకు అన్ని గ్రామాల్లోని రైతులందరూ సహకరించాలని కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్.శివరాముడు కోరారు. ఆయన మంగళవారం సాయంత్రం కర్నూలు మండలం గార్గేయపురంలో భూముల రీసర్వేను ఆకస్మికంగా తనిఖీ చేసి ఫీల్డ్ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష పథకంలో భాగంగా రీసర్వే చేసి రైతులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేయడంతో పాటు ఆధునిక డిజిటల్ రికార్డులను సిద్ధం చేస్తున్నామన్నారు. రీ సర్వే తర్వాత జారీ చేసిన రికార్డులను ట్యాంపరింగ్ చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. వీఆర్‌ఓలు మహానంది, ఖాజాబాషా, వీఆర్‌ఏలు, గ్రామ సర్వే సహాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సప్త భజనలు

గూడూరు రూరల్: వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ మండల పరిధిలోని చనుగొండ్లలో కేశవ నాగలింగేశ్వర స్వామి ఆలయంలో చేపట్టిన సప్త భజనల కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగుతోంది. ఏడు రోజుల పాటు చేపట్టిన కార్యక్రమంలో నాగలింగేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి, సమాధి నాగలింగయ్య, శ్రీరాముల భజన బృందాలు పాల్గొంటున్నాయి. నిరంతరాయంగా భజనలు నిర్వహిస్తున్నారు. భజన బృందాలకు గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సౌకర్యాన్ని కల్పించారు. ఈ నెల 23 నుంచి చేపట్టిన భజనలు 29న గురువారం రాత్రి ముగుస్తాయని భక్తులు తెలిపారు.

చెరువులకు జలకళ

- వర్షాలు, ఎస్సార్బీసీ నీటి ప్రవాహంతో చెరువుకు నీరు
- ఆయకట్టు రైతుల హర్షం



ఆలమూరు చెరువుకు చేరిన నీరు



పాణ్యం చెరువులో నీరు



ఎస్సార్బీసీ ప్రధాన కాల్వలో ప్రవహిస్తున్న నీరు

మండలంలోని చెరువుల కింద ఆయకట్టు వివరాలు

చెరువు పేరు	ఆయకట్టు (ఎకరాలు)	నీటి నిల్వ సామర్థ్యం (ఎంసీఎఫ్టీ)	చెరువు విస్తీర్ణం (ఎస్క్యూకేఎం)
పాణ్యంఊరుముందరి	327.75	22.95	0.4246
కొండజూటూరు	208.08	120.07	0.609
వడ్డుగండ్ల	127	45.91	0.1867
ఆలమూరు	172.59	74.87	0.240
కొల్లమాగుల రిజర్వాయర్	200	84.76	0.712
భూపనపాడు	450	32.70	0.781

ఎంసీఎఫ్టీ (మిలియన్ క్యూబిక్ ఫీట్స్), ఎస్క్యూకేఎం (స్క్వేర్ కిలోమీటర్లు)

పాణ్యం: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మెట్ట పొలాలు పదునవుతున్నాయి. కొందరు రైతులు ఇప్పటికే బోర్ల కింద పత్తి, మొక్కజొన్న సాగు చేశారు. ఖరీఫ్ ప్రారంభమైన తరుణంలో ఆయకట్టు కింద సాగు నీరు అందుబాటులో ఉండడం, ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ నుంచి నీరు దిగువకు ప్రవహిస్తుండడంతో అక్కడక్కడా కాల్వకు ఉన్న రంధ్రాల వల్ల పాణ్యంలోని చెరువులకు జలకళ సంతరించుకుంది. దీంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగునీరు అందుబాటులోకి రావడంతో చెరువుల కింద రైతులు వరి నార్లు సాగు చేస్తున్నారు. క్రమంగా చెరువులకు నీరు పెరుగుతోంది. మండలంలో ఆయకట్టు కింద దాదాపు 6,789 హెక్టార్లలో పంటలు సాగవుతున్నాయి.

చెరువులకు భారీగా నీరు

మండలంలో పాణ్యం ఊరు ముందరి చెరువు, రసూల్పేట చెరువు, కొండజూటూరు, ఆలమూరు, భూపనపాడు, కొచ్చెరువు తదితర గ్రామాల్లో చెరువులు ఉన్నాయి. కొచ్చెరువు కేవలం వర్షపు నీటితోనే నిండుతుంది. అలాగే సుగాలిమెట్ట వద్ద ఉన్న కొల్లమాగుల రిజర్వాయర్ నుంచి ఊటల ద్వారా పంటలకు నీరు అందుతుంది. ఈసారి అడపదడపా వర్షాలు కురవడం, గోరుకల్లు జలాశయం కట్ట కుంగిపోవడంతో మరమ్మతుల చేపట్టేందుకు అందులో ఉన్న నీటిని దిగువకు పంపుతున్నారు. ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ నుంచి ప్రతి రోజు 900 క్యూసెక్కుల మేర దిగువకు వెళ్తున్నాయి. ఈ కాల్వకు పాణ్యం, ఆలమూరు, గ్రామాల వద్ద గండ్లు ఉండడంతో వాటి నుంచి వచ్చే లీకేజీలతో చెరువులకు భారీగా నీరు వచ్చి చేరుతోంది. కొణిదేడు గ్రామం వద్ద ఉన్న వొద్దెల వాగు, ఎస్సార్బీసీ కాల్వల ద్వారా వచ్చే నీరు భూపనపాడు గ్రామంలోని చెరువులోకి వెళ్తున్నాయి. ఇలా ప్రతి రోజు చెరువులకు క్రమంగా నీటిమట్టం పెరుగుతోంది.

మండలంలోని చెరువుల కింద ఆయకట్టుతో పాటు ఎస్సార్బీసీ ఆయకట్టు, బోర్లు, బావుల ద్వారా పంటలకు ఖరీఫ్, రబీ సీజన్లలో సాగునీరు అందుతుంది. ఇటీవల ఏరువాక ప్రారంభం కావడం, వర్షాలు పడి చెరువులకు నీరు రావడం సంతోషంగా ఉందని రైతులు అంటున్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక

కర్నూలు (న్యూటౌన్): జాతీయస్థాయి హాకీ పోటీలకు గార్గేయపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని బోయ హిమబిందు ఎంపికైనట్లు రాష్ట్ర హాకీ సంఘం కార్యదర్శి హర్షవర్ధన్ నుంచి ఉత్తర్వులు అందాయని జిల్లా కార్యదర్శి దాసరి సుధీర్ తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. హిమబిందు ఈ నెల 28వ తేదీ నుంచి జూలై 7వ తేదీ వరకు రూర్కెలా, ఒరిస్సా రాష్ట్రంలో జరిగే 13వ హాకీ ఇండియా జూనియర్ ఉమెన్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. పోటీలకు ఎంపికైన క్రీడాకారిణిని మంగళవారం సాయంత్రం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

సి.బెళగల్: మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు (పీఎస్‌లు) చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. ఆయన మంగళవారం ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీఎస్‌లతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. పీఎస్‌లు గ్రామాలలో ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని, జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణకు సిద్ధంగా ఉండాలన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



చనుగొండ్లలో లబ్ధిదారునికి సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

గూడూరు రూరల్: రాష్ట్రంలో పేద మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే సుధాకర్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం చనుగొండ్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. బీసీ కాలనీలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ? అర్హత ఉన్నా ఇంకా ఏవైనా పథకాలు రాలేదా అనే విషయంతో పాటు కాలనీల్లో నెలకొన్న సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో ప్రభుత్వ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీలు సిఫారసు చేసిన వారికి మాత్రమే అందేవని, అర్హత ఉన్నా పథకాలు రాక పేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పని చేస్తున్నారన్నారు. గత నాలుగేళ్లలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పథకాలను అందించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మండల కో-ఆప్షన్ సభ్యుడు దౌల, గూడూరు నగర పంచాయతీ వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, బోయ లక్ష్మన్న, పట్టణ కన్వీనర్ అబేలు, నాయకులు ఎల్.వెంకటేశ్వర్లు, మహేశ్వరరెడ్డి, మాధవస్వామి, రంగయ్య, ఎంపీడీఓ మాధవీలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సన, ఏపీఎం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటల సాగు లాభదాయకం



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ సాలురెడ్డి

సి.బెళగల్: పత్తి పైరులో అంతర పంటలను సాగు చేసుకోవడం వల్ల తెగుళ్లు, చీడ పురుగుల బెడద నివారించవచ్చని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి రైతులకు సూచించారు. ఆయన మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఓ మల్లేష్‌కుమార్‌తో కలిసి రైతులకు ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగులో తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ఏడీఏ మాట్లాడుతూ.. పత్తి పంటలో పెసర, కంది, మినుము అంతర పంటలుగా సాగు చేసుకోవడంతో బెట్ట పరిస్థితులలో అదనపు పంటల దిగుబడులతో పాటు, పత్తిలో తెగుళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చని వివరించారు. అనంతరం వ్యవసాయ సహాయకులు పంటల సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ పద్ధతులను వివరించారు.

అందుబాటులో రిజిస్ట్రేషన్ సేవలు



అమడగుంట్ల గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న తహసీల్దార్ జయన్న

కోడుమూరు రూరల్: కోడుమూరు మండలం అమడగుంట్ల గ్రామ సచివాలయంలో భూముల రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు తహసీల్దార్ జయన్న మంగళవారం తెలిపారు. అమడగుంట్ల పరిధిలోని చిల్లబండ గ్రామానికి చెందిన దస్తగిరికి తండ్రి ద్వారా పొందిన పొలం రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశామని, గత కొన్ని రోజులుగా ఉన్న టెక్నికల్ సమస్యలన్నీ తొలగిపోయాయన్నారు. ఇకనుంచి ఆయా గ్రామాల ప్రజలు అమడగుంట్ల గ్రామ సచివాలయంలో రిజిస్ట్రేషన్ సేవలను పొందవచ్చునని తహసీల్దార్ చెప్పారు. సొంత గ్రామంలోనే రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించడంతో దళారుల బెడద తగ్గడంతో పాటు, మండల కేంద్రానికి ఖర్చులు పెట్టుకుని వెళ్లి సమయం వృథా చేసుకునే అవస్థలు తొలగిపోయాయని అమడగుంట్ల వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పత్తిలో అధిక మొక్కల పద్ధతి మేలు



అధిక మొక్కల సాంద్రత పద్ధతిలో విత్తిన పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత కళ్యాణి

కల్లూరు: పత్తి పంటను అధిక మొక్కల సాంద్రత పద్ధతిలో విత్తుకోవడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చునని ప్రాంతీయ పరిశోధన వ్యవసాయ కేంద్రం (ఆర్ఏఆర్ఎస్) శాస్త్రవేత కళ్యాణి సూచించారు. మంగళవారం లక్ష్మీపురం గ్రామంలో హనుమంతురెడ్డి పొలంలో అధిక మొక్కల సాంద్రత పద్ధతిలో చేపట్టిన పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో 11 మంది మంది రైతులకు అధిక సాంద్రత పద్ధతిలో విత్తుకునే విత్తనాలను ఉచితంగా అందించామన్నారు. మంగళవారం అదనంగా మరో 10 మంది రైతులకు విత్తనాలు అందించినట్లు తెలిపారు. పత్తి పంట విత్తుకోవడానికి రైతులు రెండు ప్యాకెట్ల విత్తనాలు అవసరం కాగా అధిక మొక్కల పద్ధతిలో ఎకరానికి నాలుగు ప్యాకెట్లు విత్తుకోవాలన్నారు. పంట కాలం 140 రోజుల్లో పూర్తవుతుందన్నారు. సాధారణంగా సాలుకు 4 అడుగుల దూరం వేయాల్సిఉండగా వీటిని మాత్రం సాలుకు మూడు అడుగులు, మొక్క మొక్కకు అడుగు దూరంలో విత్తుకోవాలని సూచించారు. ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, వీఏఏ పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం



కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి

ఓర్వకల్లు: ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల సాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి సూచించారు. ఆయన మంగళవారం కాల్వ గ్రామం వద్ద జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. రోజువారీ వేతనాలను గురించి కూలీలను అడిగి తెలుసుకున్నారు. పీడీ మాట్లాడుతూ.. జిల్లాలో 6 వేల ఎకరాలలో పండ్ల తోటల పెంపకం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. లక్ష్యం మేరకు ఉపాధి సిబ్బంది చిన్న, సన్నకారు రైతులతో మాట్లాడి పండ్ల తోటల సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కూలీలందరికి పనులు కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరు రోజుకు రూ.272 వేతనం పొందేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కుంటలు, వంకలు, చెక్‌డ్యాంలలో పూడికతీత పనులను చేపట్టి వర్షపు నీటిని నిల్వ ఉంచి భూగర్భ జలాలను పెంపొందించాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓ శివనాగప్రసాద్, సీఎల్ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల, ఏపీఓ కుమార్‌సాయినాథ్, ఈసీ మధుకృష్ణ, క్షేత్ర, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో పారదర్శకత



గడిగరేవులలో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

గడివేముల: వైఎస్సార్‌సీపీ పాలనలో అవినీతి, లంచాలకు తావులేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఆయన మంగళవారం గడిగరేవుల గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి లబ్ధిదారులకు బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పేదప్రజల అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా సంక్షేమ పథకాల సారథిగా సీఎం ప్రశంసలు అందుకుంటున్నారని తెలిపారు. లంచాలకు, వివక్షకు తావులేకుండా, కార్యాలయాల చుట్టూ తిరిగే దుస్థితి లేకుండా గ్రామ/వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ పొలాల ఆన్‌లైన్ నమోదులో సమస్య ఉందని ఎమ్మెల్యే దష్టికి తీసుకురాగా త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసులును ఆదేశించారు.

చిన్నారులకు నాణ్యమైన భోజనం అందించండి: అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సూచించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. చిన్నారులకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జెడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖర రెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు శిరుప శ్రీనివాసరెడ్డి, సునీల్‌కుమార్ రెడ్డి, ఎంపీడీఓ శివ మల్లేశ్వరప్ప, ఏపీఎం హజరత్, ఎంపీటీసీ జక్కుల సావిత్రి, కోఆప్షన్ సభ్యుడు బాషా, సర్పంచ్‌లు రామ్మోహన్ రెడ్డి, నాగేశ్వర రెడ్డి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలకు అంతరాయం కలిగించొద్దు



రైల్వే సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: ప్రజల రాకపోకలకు అంతరాయం లేకుండా పనులు చేసుకోవాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. ఆయన మంగళవారం రాత్రి నెరవాడ గ్రామం వద్ద రైల్వే డబుల్ లైన్ పనుల్లో భాగంగా చేపడుతున్న వంతెన నిర్మాణాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత నెల రోజుల నుంచి రైల్వే పనుల పేరుతో రోడ్డుకు అడ్డుగా గుంత తీయడం వల్ల ప్రజలు సుమారు 6 కి.మీ దూరం ప్రయాణించాల్సి వస్తోందన్నారు. రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపి పనులు చేసుకోవాలన్నారు. నాయకులు సద్దల సూర్యనారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ పార్వతమ్మ, రమణారెడ్డి, సుమంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'సుంకేసుల'లో 1. 068 టీఎంసీల నీటి నిల్వ

గూడూరు: 'సుంకేసుల' డ్యాంలో 1.068 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు మంగళవారం డ్యాం అధికారులు తెలిపారు. కర్నూలు నగరవాసుల నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు 189 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

వీఆర్‌ఏ మృతికి సంతాపం

సి.బెళగల్: మండల పరిధిలోని కె.సింగవరం గ్రామంలో వీఆర్‌ఏగా విధులు నిర్వర్తిస్తున్న బోయ నాగన్న (64) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీటీ కృష్ణమూర్తి, వీఆర్వో శ్రీనివాసులు, వీఆర్‌ఏలు గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల ఖర్చులకు రూ.20 వేల ప్రభుత్వ ఆర్థిక సాయం అందజేశారు.

నిరుపేదలకు భూములు పంచాలి

కల్లూరు: భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వ భూములను పంచాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ, సీఐటీయూ మండల కార్యదర్శి డిమాండ్ చేశారు. మంగళవారం బొల్లవరం గ్రామంలోని ప్రభుత్వ భూమిలో రైతు సంఘం ఆధ్వర్యంలో చెట్లు కొట్టి పనులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో సర్వే నంబర్ 1లో వంద ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, ఈ భూమిని దళితులు, బడుగు బలహీన వర్గాల వారికి కేటాయించి హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

పాణ్యం: మండల పరిధిలోని కందికాయపల్లె గ్రామంలో గ్రీన్ కో సోలార్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. రాజస్థాన్ రాష్ట్రం, ప్రతాప్‌నగర్ జిల్లాకు చెందిన సునీల్ మీనా (25) పరిశ్రమలో బోర్‌వెల్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఉన్నట్టుండి గుండెనొప్పి రావడంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతిచెందాడు. మృతుడి సోదరుడు బీర్‌లాల్‌మీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రతి విద్యార్థికి జేవీకే కిట్టు అందాలి

పాణ్యం: ప్రభుత్వ పాఠశాలలో ప్రతి విద్యార్థికి జేవీకే (జగనన్న విద్యా కానుక) కిట్టు పంపిణీ చేయాలని ఎంఈఓ కోటయ్య సూచించారు. మంగళవారం పాణ్యంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈఓ-2 సుబ్రమణ్యంతో కలిసి అన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు సమావేశం నిర్వహించారు. జేవీకే కిట్లు పూర్తి స్థాయిలో అందకపోతే ఎంఆర్‌సీ కార్యాలయానికి సమాచారం అందించాలన్నారు. డ్యామేజీ ఉంటే రిటర్న్ చేయాలన్నారు. నాడు-నేడు పనులు పూర్తి చేయాలని, ఐఎఫ్‌పీ స్మార్ట్ టీవీపై అవగాహన కల్పించారు.

ఆల్ ఫ్రీ బాబును ప్రజలు నమ్మరు



మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): టీడీపీ అధినేత, ఆల్‌ఫ్రీ చంద్రబాబును ప్రజలు నమ్మరని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ఎద్దేవా చేశారు. మంగళవారం సాయంత్రం స్టాంటన్‌పురంలోని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తుండడంతో చంద్రబాబు దళితులపై కపట ప్రేమ చూపిస్తున్నారని, గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఎవరైనా దళితులుగా పుట్టాలనుకుంటారా అంటూ ఘోరంగా అవమానించారని గుర్తుచేశారు. కొందరు టీడీపీ మంత్రులు సైతం దళితుల వద్ద వాసన వస్తుందని అవహేళన చేసిన సంగతి ఎవరూ మరచిపోలేదన్నారు. చంద్రబాబు హయాంలోనే దళితులపై హత్యలు, అఘాయిత్యాలు అత్యధికంగా జరిగాయని చెప్పారు. చంద్రబాబు హయాంలో దళితులకు ఎంతమేర లబ్ధి చేకూర్చారో చర్చకు రావాలని సవాల్ విసిరారు.

జగనన్న ప్రభుత్వంలో భారీగా లబ్ధి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న హయాంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.53,919 కోట్లు ఎస్సీల ఖాతాలో జమ చేశారని వివరించారు. పేదల అభివృద్ధి జరగాలంటే సంక్షేమ పథకాలు అందించాలన్న సంకల్పంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. ఆల్‌ఫ్రీ బాబు అమ్మ ఒడి ఇస్తాం, మహిళలకు నెలకు రూ.3 వేలు ఇస్తాం, ఏడాదికి మూడు సిలిండర్లు ఫ్రీ అంటూ మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు కొత్త నాటకం మొదలుపెట్టారని ఎద్దేవా చేశారు. 2014 ఎన్నికల సమయంలో 600 హామీలిచ్చి ఒక్కటీ నెరవేర్చకపోవడంతోనే ప్రజలు తగిన బుద్ధి చెప్పారని వివరించారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు, దత్త పుత్రుడికి పవన్‌కళ్యాణ్‌కు ప్రజలు గుడ్‌బై చెప్పి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. వైస్ ఎంపీపీ-2 నెహేమ్యా, నాయకులు మోహన్‌బాబు, కరీముల్లా, సంపత్‌కుమార్, సుంకన్న, విద్యాసాగర్, హరినాథ్‌రెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పకడ్బందీగా చేపట్టాలి



ఎర్రదొడ్డిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ జయన్న

సి.బెళగల్: మండలంలోని గ్రామాలలో చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ శేషఫణి సూచించారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయం- 2లో ఎంపీడీఓ రాముడు, మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులతో జగనన్న సురక్షా కార్యక్రమం అమలు విధానాలు, నిర్వహణపై సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ఆయా కుటుంబాలకు అందాల్సిన పథకాలను వలంటీర్ల ద్వారా నమోదు చేసుకుని అందుకు అవసరమయ్యే 11 రకాల ధ్రువపత్రాలను అర్హులైన వారికి ఉచితంగా అందజేయాలని సూచించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలో జూలై 4 నుంచి కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

కోడుమూరు రూరల్: ప్రజల అవసరాలు, ఇబ్బందులను తీర్చేందుకై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం మండలంలోని ఎర్రదొడ్డి, అమడగుంట్ల గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వారు పరిశీలించి సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు పలు సూచనలిచ్చారు.

ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

ఎర్రదొడ్డి గ్రామంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను వారు పరిశీలించారు. నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈఓఆర్డీ మంజుల, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

నేడు 'అమ్మ ఒడి' కార్యక్రమం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం మిలిటరీ కాలనీలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 'జగనన్న అమ్మ ఒడి' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఈఓ కె.వినోద్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ప్రత్యేక అతిథులు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యేలతో పాటు ప్రత్యేక ఆహ్వానితులు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవతేజ, జిల్లా రెవెన్యూ అధికారి వి.నాగేశ్వర్‌రావు, అడిషనల్ ప్రాజెక్టు కో -ఆర్డినేటర్ కె వేణుగోపాల్, డీఈఓ వి.రంగారెడ్డితో పాటు ఎమ్మెల్సీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు హాజరవుతారని పేర్కొన్నారు.